మూసుకుని ఉన్నాయి. కాని ఆమె జ్వరపీడిత ముఖంలో చిరునవ్వు కన్పిస్తూంది. ఆమెవైపు రాతిలా చూస్తూ నిలబడ్డాను. ఆమె దగ్గిరే నిలుచున్నాను. ఈ సంగతి ఆమెకు తెలుసో తెలియదో! తెలియదు. ఆమె చిరునవ్వు ఎక్కువైంది. నేనప్పుడు ఆమెను పలకరించడానికి వంగాను, ఆమె కండ్లు తెరచి నా కండ్లలోకి చూసింది. నేను చూశాను, ఆమెకు కండ్లు తెరవడానికి గూడా శక్తిలేదని. ఆమెచూపు శూన్యంగా ఉన్నాయి. ఆమెను ఈస్థితిలో చూడ్డానికి నాగుండె కంపించింది. నే నొచ్చానని చెప్పబోతున్నా శాలువలో నుండి రెండుచేతులు బయటకొచ్చాయి. ఆమె కంఠశక్తి ఎక్కడిదొచ్చిందో నన్ను కౌగలించుకుని అన్నది. "మహేంద్రా-చివరకు వచ్చావా!...నీకోసమే నా ప్రాణాలు...నా ప్రాణాలున్నాయి. మహేంద్రా" నన్ను ఆమెవైపు లాక్కోవడానికి ప్రయత్నించింది.

ఆమె తల కొద్దిగా పైకి లేచింది. మరుక్షణములో నన్నొదిలి పడిపోయింది తొడమీద తల పెట్టింది. "మహేంద్రా నువ్వొచ్చావా" ఈమాటలే ఆమె నోటినుండి రెండుమూడుసార్లు వినపడ్డాయి.

వెంటనే చేతులు నాకంఠంనుండి క్రింద పడిపోయాయి. కండ్లు మూసుకుపోయాయి. ఆమె శరీరంలో చైతన్యం యెంత త్వరగా ప్రవేశించిందో - అంతే వదలిపోయింది. ఆ ఆరిపోయే జ్యోతినిచూస్తూ శిలాప్రతిమలా ఉండిపోయాను.

నేను అధీరుడనైనాను. నాకండ్లముందు సురేఖ చావు చూశాను. భరింపరానిదుఃఖం వచ్చింది. అందులో సంతోషచిహ్నం కనుపించింది-మహేంద్రుడు ఆమెను కలవడానికి వచ్చాడనుకొంది. అందువల్ల ఆమె చివరిక్షణం సుఖంగా గడిచింది. ఆమె ఎవరికోసం ఇన్నిసంవత్సరాలు లేచిఉందో, ఎవరికోసం ఇంత జబ్బుపడ్డదో అతనొచ్చాడు, అతనిని కౌగలించుకుని ప్రాణాలు వదిలింది. ఆమె జీవితాన్ని సుఖమయం చేద్దామనే నా కోరిక ఫలించలేదు. కాని ఆమె చావును సుఖమయం చేయగలిగాను.

(అనువాదం: ఆకుల వెంకటేశ్వరరావు)

కథానిక

# తీరినకోరిక

కె. రామలక్ష్మి

ఇంట్లో అంతా హడావిడిగా తిరుగుతున్నారు.

పెళ్లివారు దిగే సమయం దగ్గిర పడినకొద్దీ హడావిడిలోకూడా స్థాయి హెచ్చుతోంది. రాబోయే పెళ్ళివారిలో అందరూ అందమైన వాళ్ళే. అందరికంటే అందకత్తె పెళ్లికూతురు. ఇంకనేం? ఇన్నాళ్ళు కాలేజీలో పిల్లల్ని రెప్ప వాల్చక చూసిన మరిదికి ఇక అలాంటి శ్రమ ఉండదు. ఇంటికొచ్చిన భార్య అందచందాలు చూస్తూ ఆనందించవచ్చు. తనగదిలో అద్దంముందు తల దువ్వుకుంటూ నించున్న పార్వతికి ఏం హడావిడి వున్నట్లు కనిపించడంలేదు. తనేంచెయ్యాలి? ఇంటి పెద్దకోడలు కనక చక్కగా అలంకరించుకొని అందరి ముందూ అచ్చరకన్నెలా తిరుగుతే చాలు! అయినా తను చెయ్యవలసిన పనేముంది? అన్ని పనులూ అందరూ చేసుకుపోతున్నారు. తన పొడుగాటి జుట్టు ఎలా కట్టుకుంటే బాగుంటుందో? తల దువ్వి దాన్ని తీర్చి దిద్దుతూ, ఏ చీరమీద ఏ జాకెట్టు వేసుకోవాలి? ముత్యాలదండ వేసుకోవాలా? ఎర్రరాళ్ళదండ వేసుకుంటే బాగుంటుందా?... ఆలోచించుకుంటూంది... అబ్బే! మెడమీదికి బాగా కిందికి వచ్చేసింది! జుట్టు మళ్ళీ విప్పింది, మళ్ళీ ఒకసారి దువ్వి... బాగా పైకికట్టి చుట్టింది. ఇంత అందమైన మెడ వుండేదాన్ని జుట్టుతో కప్పేయడమేమిటి? స్ఫటికంలా స్వచ్ఛంగా ఎంతబాగుంది! ఆ చిన్నిచిన్ని ముంగురులు కిందికి వేలాడుతూ; సరిగ్గా అజంతా బొమ్మలాగుంది తను!... అవును, అందాన్ని ఇనుమడింపచేసుకోవాలేకాని, వున్నదాన్ని కప్పేయడం దేనికి?...ముత్యాలా, ఎర్రరాళ్ళా... అనుకుంటూంది.. "అయ్యబాబోయ్! ఏమిటొదినా

ఈ అలంకరణ? మా చిన్నన్నకి కాదూ పెళ్ళి?" అంటూ చిన్నాడపడుచు గుమ్మంలోనే ఆశ్చర్యంగా ముఖం పెట్టి నిల్చుండిపోయింది.

"అయితే ఏం చెయ్యమంటావ్? కొంచం మసి పూసుకోనా?" ముఖం చిట్లించుకుంటూ అంది పార్వతి.

"అదేమిటొదినా అలా అంటావు? పుట్టినే వేళాకోళానికన్నాను కాని!... అయినా నీ కింకో పని ఏముంది... అంతా తెరిపే కనుక అలంకరించుకుంటూ కూర్చుంటావు; మాకు దేనికీ తెరిపే వుండదు... పిల్లా పాపా...సద్దుకువచ్చే సరికి అన్ని శక్తులూ, ఆశక్తులూ నశించుతాయి" చిన్న పుచ్చుకున్న ముఖంతో అంది చిన్న ఆడబిడ్డ.

"అవునవును. మీకు అలంకరించుకుందుకే టైము వుండదు కాబట్టి ఇంకొకళ్లు అలంకరించుకుంటూన్నా ఏదోలా వుంటుంది! కదూ?" అంది పార్వతి అపహాళన పుట్టిపడే కంఠస్వరంతో.

"ఏమో ఒదినా! ప్రతిదానికీ నువ్వు అలాగే అనుకుంటావు...మాకు ఏదోలా వుండడందేనికీ? ఏకుండాలి కాని" అంటూ అక్కడ నించోకుండా గ్గాపోయింది ఆడబిడ్డ.

"అవునవును అలాగే అనుకోండి...మధ్యని నాకెందుకు ఎలాగో వుండడం? పిల్లలు లేరనా. వాళ్లుకూడా ఎందుకు బాబూ ప్రాణంకొరుక్కుతిండానికి" అనుకుంటూనే...అనుకోని ఆలోచనలలో పడిపోయింది పార్వతి...తనూ భర్తా హాయిగా కబుర్లుచెప్పుకోకుండా మధ్యని పిల్లలు కూడా ఎందుకు! మధ్యలో గీపెట్టడం మొదలెడితే... చావాలి పూరుకో పెట్టడానికి. ఏమీ వద్దుబాబూ! ఇలాగే కాలం వెళ్ళిపోతే...

* * *

"ఏం చిన్నీ ఒదినేంచేస్తోందే? కొంచం యీవంటు యింటిలో చూచుకోకపోతే ఎలాగే!" అంటూ మాట్లాడుకుంటూ పోతున్న తల్లికి అడ్డు తగిలి "ఏమోనమ్మా...ఆవిడసంగతి నన్నడక్కు! వెళ్ళి ఏదో చిన్న వేళాకోళంగా మాట్లాడితే కస్సుమంటూ మీదకొచ్చింది. అయినా పిల్లలు లేరని తనకి బాధగా వుండాలి కాని-వున్నారని నాకెందుకమ్మా బాధ? ఆదేమిటి ఒళ్ళు తెలియకుండా అలా మాట్లాడుతుందేమిటి?"

"పోనీలే చిన్నీ... తనలేమి చెప్పుకోలేక యింకొళ్ళ కలిమిని ఎత్తిపొడుస్తూంది పార్వతి. వయస్సులో పెద్దే అయినా ఏం తెలివి తేటలు రాందే మనం ఏంచేస్తాం తల్లీ" అంటూ నిట్టూర్చింది ముసలితల్లి-పార్వతి అత్తగారు...ఎప్పుడు వచ్చిందో పార్వతి..."అందేమిటి అత్తయ్యా మీరూ అలాగే అంటారు? ఎందుకొచ్చిన బాదర బందీ...ఇప్పుడే హాయిగా వుంది" అనేసింది.

"ఏమిటే నీముఖం? హాయేమిటి? పిల్లాపాపా లేకుండా వుండడం హాయా! నాలుగేళ్ళయి పెళ్లి అయినా!" అంటూ కసిరింది.

"నాలుగేళ్ళకే పిల్లలు బయలుదేరితే ఎలా అత్తయ్యా? మేం యిద్దరం హాయిగావుంటే మధ్య వాళ్ళంతా బాధపడుతున్నారు." నెమ్మదిగా అంది.

"వాడు హాయిగావున్నాడో హృదయం తడారిపోయివున్నాడో నీ వెప్పుడేనా కనుక్కున్నావా?" నిలువునా ప్రశ్నించింది అత్తగారు.

"ఏమో...మరి హాయిగా వున్నట్టేవున్నారు" ఇక మాట్లాడకుండా తన గదిలోకి వెళ్ళిపోయింది పార్వతి. గడిచిపోయినది.కళ్లకి కట్టింది ఒక్కసారి.

* * *

పార్వతి అతి సామాన్య కుటుంబంలో పుట్టింది. అయినా ఒంటరిది కాదు. ఐదుగురి ఆడపిల్లలకీ పెద్దది. తన హృదయం కోరికలతో ముందుకి వురకలు పెడుతూన్నా అన్నిటికీ కళ్ళెంవేసి పూరుకోవలసి వచ్చేది. తండ్రికి వచ్చే ఆదాయం తక్కువ. అందుచేతనే తల్లి అన్నీ పొదుపుగా చేసేది. తనకి బంగారం గాజులు చేతినిండా వేసుకోవాలని వున్నా గాజు గాజులతో తృప్తి చెందవలసి వచ్చేది. చక్కచక్కటి చీరలు కట్టాలని వున్నా సాదావాటితో కాలం పుచ్చేది... కాని తన అందమైన శరీరం-తనని తీసుకువచ్చి ఈ అగర్భ శ్రీమంతుల యింట్లో పడవేసింది. దంతంలాటి తన శరీరాన్ని చూసీ తీర్చిదిద్దిన శరీర సౌష్ఠవాన్ని చూసీ అతడు కోరి పెళ్ళిచేసుకున్నాడు. హఠాత్తుగా తన జీవితంలో వచ్చిన యీ మార్పుకి మొదట్లో తబ్బిబ్బులయినా కొన్నాళ్ళలోనే యీ సుఖజీవితానికి తాను అలవడిపోయింది. అత్తగారి యింటికి వచ్చాక

మళ్ళీ పుట్టినింటికి తను పోలేదు...తను ఏది కోరితే అది తెచ్చియిచ్చి, తన ఆనందమే అతని ఆనందంగా చూసుకొనే భర్తని విడిచి ఒక్క రోజు కాదు ఒక్క క్షణమైనా వుండలేను అనుకుంది. తను యీ యింటికి వచ్చేసరికే ఆడపడుచులిద్దరికీ పెళ్ళిళ్లు అయి కాపురాలు చేసుకుంటున్నారు. ఒక్క మరిది మిగిలాడు పెళ్ళికి. మరిది తన భర్తలాగే అందగాడు. ఇంటికి రాబోయే చిన్నకోడలు కూడా తనలాగే ఆనందంగా వుంటుంది...అనుకుంది పార్వతి. పిల్లలు లేనంత మాత్రాన తన జీవితానికి వెలుగు లేదనుకొనే తత్వం కాదు. లేకపోతే యేం? వుండి తన ఆడపడుచులు చూడు వాళ్ళ రోగాలతోటీ గోలతోటీ ఎలా అవస్థలు పడుతున్నారో!

* * *

మరిది పెళ్లిజరిగి అప్పుడే ఆర్నెల్లుపరిగెత్తాయి. ఇంట్లో ఏదో తెలియని వెలుగు ప్రవేశించినట్లుంది క్రొత్తకోడలి రాక. పెళ్లిఅయి చాలా రోజులైనా పెళ్లికూతురి సిగ్గుపోలేదు రమకి. పార్వతిదగ్గరకూడా తలెత్తి మాట్లాడేది కాదు... ఆరోజు పార్వతి ఎంతో సరదాగా రమకి తల దువ్వుతూంది. అప్పుడే కనిపెట్టింది...ఆమెలో ఏదో మార్పు వుందని...

"ఏంరమా ఏమిటి విశేషం! చక్కగా బుగ్గలూ ఉబ్బివచ్చి ఎంతో అందంగా వున్నావు!" అంది రమ ముఖం తనవేపు తిప్పుకుంటూ.

"అదేమిటి అలా వేళాకోళం చేస్తావు!" అంటూంటేనే సిగ్గుతో రమ చెంపలు ఎర్రపడ్డాయి.

"ఓహో ఇంకనేం! మరిదికి బుద్ధిచెప్ప దలుచుకున్నా నన్న మాట" అంది పార్వతి.

"నీకింకా తెలియనే తెలియదా? ఇంక రెండు మూడు రోజులలో వెళ్ళిపోతాను అమ్మగారింటికి. ఓసారి మాయింటికివచ్చి అప్పుడు నన్ను చూస్తావా పార్వతీ?" అంది రమ.

"ఎందుకురానూ! తప్పకుండా వస్తా, నేనొక్కర్తెనే ఎందుకూ, మేం యిద్దరంకలిసే వస్తాం! సరా?...ముందు వెళ్ళి యీ సంగతి ఆయనకి చెప్పిరానీ" అంటూ గదిలోంచి పరిగెత్తింది పార్వతి... "ఏమండీ..." అంటూ భర్త గదిలోకి వచ్చింది పార్వతి. టేబిలుమీద కాళ్ళు చాచి కళ్ళకి చెయ్యి అడ్డుపెట్టుకుని దీర్ఘంగా ఆలోచన చేస్తున్నాడు...దగ్గరికిపోయి అతని మెత్తటి కురుల్లో వేళ్లు ఆడిస్తూ...అడిగింది "ఏమిటి అలా ఆలోచిస్తున్నారు?"

"నువ్వాపారూ, రా యిలాకూర్చో" అంటూ టేబిలుమీదనుంచి కాళ్లుతీసి కూర్చున్నాడు.

"కూర్చుంటాను గాని...ఏమిటి ఆలోచిస్తున్నారు? నాక్కూడా చెప్పకూడని విషయాలేమున్నాయి!" అంటూ అతని తల హృదయాని కద్దుకుంది.

"ఏంలేదు పారూ!...మొన్న మొన్నటిదాకా చేతికింద పుస్తకాలు పెట్టుకుని యీలవేసుకుంటూ పోయే, రాముడికి అప్పుడే ఓ పెళ్ళామూ, ఓ పిల్లా తాపత్రయం అన్నీ ఏర్పడిపోయాయి. ఇదంతా చూస్తే ఆశ్చర్యంగా లేదూ?"

"మీకూ ఓపాపాయి కావాలనివుందికదూ?" కొంటెగా అతని కళ్లల్లోకి చూస్తూ అడిగింది పార్వతి.

"నీవిచ్చి కాని కావాలనుకుంటే వస్తుందేమిటి? ఈ వున్న పరిస్థితుల్లోనే నువ్వు ఎంతో ఆనందం వున్నావు. ఇంక నీకు కావలసిందేమిటి?—చూడు పారూ! ఈ యింట్లో వుండడంకంటె...యీ సుఖమయిన జీవనంకంటె ఏ అడవులకో పోయి తపస్సు చేసుకొంటే, ఎంతో హాయిగా వుంటుంది అవునా?"

"నాకంటె ముందు మీకే తోచిందే!...యీ సంగతి చెప్పండి. రమ ప్రయాణానికి అన్నీ సిద్ధంచేసారా?"

"ఆ...అంతా సిద్ధంగానేవుంది... పాపం! రాముడి ముఖం అప్పుడే వన్నెవాడిన చిగురాకులా వుంది! అలా వుంటుంది కాబోలు!..." అంటూ నిట్టూర్చిన భర్తనిచూసి, "మీరూ యీ అమ్మలమ్మల తరహావారే!" అంటూ వెళ్ళింది అవతలికి.

అవును అమ్మమ్మల తరహావాడే! లేకుంటే తనకీ ఒక పాప కావాలనుకోవడం ఏమిటి? తన యింటిపేర ఒక పుత్రుడుండాలని అనుకోవడం ఏమిటి...? అనుకుంటూ ఆలోచనలో మునిగిపోయాడు.

చంటిబిడ్డ నెత్తుకొని రమ యింటికి వచ్చింది. ఇల్లంతా పిల్లడి ఏడుపుతో నిండినట్టయింది పార్వతికి... తెల్లవారలేస్తే ఆ పిల్లవాడే లోకం రమకి. నీళ్ళుపోసి, బొట్టుపెట్టి, లాలిపాడి పడుకో పెడుతుంది. యింకో అరగంటకి ఏడుస్తూనే లేస్తాడు పిల్లాడు. మళ్లీ నిద్దరపోయేదాకా పాటపాడుతుంది రమ. ఆ ముద్దులాడ్డంలో ఎన్ని మాటలు దొర్లుతాయో....యిదంతా చూస్తుంటే పార్వతికి ఆశ్చర్యంగా వుండేది. అప్పుడప్పుడు మరిదిని వేళాకోళం చేస్తూవుండేది..."నిన్ను మరిచిపోయిందోయ్ మరిదీ" అని. కాని మరిది దానికేం బాధ పడుతున్నట్లు తోచలేదు పార్వతికి.... పిల్లవాని రాకతో రమమీద మరిది అనురాగం ఎక్కువైందేకాని తగ్గలేదు. లేకుంటే అంత నిండు హృదయంతో మరిది పిల్లవాడిని లాలించ కలడా...!

* * *

"మీరు నాకు చెప్పరా?" గట్టిగా అడిగింది పార్వతి. అంతకిముందే యింట్లో అత్తగారితో దెబ్బలాడింది పార్వతి... తన భర్త మనస్సు పాడు చేసారని. తనకి పాపలేకుంటే, తనకి భర్తకీ లేని బాధ యీ పైవాళ్ళకెందుకో!..."నిజంగా అలాగే వుంటే, యింకో సంబంధం చూసుకో కూడదూ!" అనేసి నాలిక్కరుచుకుంది-భర్తముఖం చూచి. అతని ముఖం ఎంతో చిన్నపోయింది యీ మాటలు విని.

"నువ్వు నన్నిలా అడుగుతే ఏం చెప్పమంటావు పార్వతీ...అలా మాట్లాడడానికి ముసలివాళ్లు వున్నారు. నువ్వేనా వూరుకుంటే ఎంతో బాగుండును."

"ముసలివాళ్ళు చెప్పడం అయిందన్నమాట! యీ సంగతి నాకెందుకు చెప్పలేదూ? నాదగ్గిర నుంచే దాచాలా?" ఆమె కళ్లు నీళ్ళతో నిండాయి. ఇక మాట రాలేదు.

"నీకేమైనా మతిపోయిందా పార్వతీ! ముసలివాళ్లు ఏదో అంటే అంటారు. వాటినిపట్టుకుని మనిద్దరం మనస్సులు పాడుచేసుకోడం బాగు లేదు."

"అవును, ఎలా బాగుంటుంది?... ఇంతకీ ఆ ముసలివాళ్లు ఎవరో చెప్తారా?" కోపంగానే అడిగింది పార్వతి.

"ఇప్పుడదంతా ఎందుకూ?"

"చెప్పరా?"

"అవన్నీ ఎందుకు పార్వతీ! ప్రశాంతంగా వున్న యింట్లో అల్లరి బయలుదేరడానికి తప్ప!"

"సరే. మీరు నాకేం చెప్పనూవద్దు, నేను విననూవద్దు. మీకోరిక తీర్చుకోండి. నేపోతాను" విసురుగా గదిలోంచి వచ్చేసింది పార్వతి.

* * *

పెళ్ళి అయాక పుట్టినింటికి రాని పార్వతి ఆరోజు అకస్మాత్తుగా దిగడం అందరికీ ఆశ్చర్యంగానే వుంది. ఇల్లు హడావిడిగా కూడావుంది. ఇద్దరు చెల్లెళ్ళు వచ్చివున్నారు. అమ్మకి ఒకట్లో బాగులేదు. అంతా గందరగోళంగావుంది. అప్పుడే ఇంట్లో అడుగుంచింది పార్వతి. ఇన్నాళ్ళూ పార్వతి పుట్టింటికి రాకపోడానికి ఒకటే కారణం: ఇప్పటి తన ఐశ్వర్యాన్ని ప్రదర్శించి తన తల్లి దండ్రులని ఖిన్నపరచడం యిష్టంలేకపోవడం. కాని యివాళ తనకి మళ్ళీ యిదే ఆశ్రయం అవడంలో ఆనందంగానే వచ్చేసింది. ఒకచెల్లెలు తొలిసారి కాన్పుకి వచ్చింది. ఇంకోచెల్లెలికి ఒంట్లో బాగులేక వచ్చింది. ఆమెకి ఒకపిల్ల... అనుకోకుండానే వెలగడిచిపోయింది. భర్తదగ్గరి నుంచి ఎన్నో ఉత్తరాలు వచ్చాయి. తనకి తిరిగి పోబుద్ధి పుట్టలేదు. చెల్లెలికి పిల్లవాడు. వాణ్ణి చూసి ఎంతమురిసిందో! "వాడి అందం బాగానే వుందికాని, నిజంగా అంత యిష్టంటే నీకు!" అని చెల్లెల్ని పార్వతి అడిగింది.

"నీకూ వుంటే తెలుసును-ఆ వాత్సల్యం!" అంటూ తనకొడుకుని హృదయానికి హత్తుకుంది. ఇవేమాటలు రాత్రంతా పార్వతి చెవులలో మారుమోగాయి. నిజంగా ఆ వాత్సల్యం ఏమిటో తనకి తెలియదు! మరి యిన్నాళ్ళూ హాయిగా వున్నాననే అనుకుంటే. తనని తనే అలా మోసం చేసుకుంటూ వచ్చిందా? ఆనాడు తనభర్త తపస్సుకి పోదాం బాగుంటుందని అన్నాడు. ఎందుకు? యీ ఐశ్వర్యం యీ సౌఖ్యాలూ వేలవమనా? లేక ఎదురుచూడ్డానికి ఏమీలేకనా?

అనుకోకుండానే పార్వతి హృదయం ఆవేగంతో కొట్టుకుంది. "ఇదివరకెన్నడూ నిన్ను ఏమీ అడగలేదు. ఇప్పుడు అడుగుతున్నాను...కుంటైనా గుడ్డి అయినా ఫరవా లేదు...ఒక పాపని నాకు యియ్యి. నా భర్తకీ నాయింటికీ నన్ను దూరం చెయ్యకు."అని ఎక్కడున్నారో...తెలియని దేవతలకి మ్రొక్కింది...ఎందుకో పార్వతిహృదయం తేలిక పడింది. భర్త సాన్నిధ్యంకోసం, తను క్షమార్పణ వేడుకోడంకోసం త్వరపడసాగింది.

* * *

కొన్ని నెలలతరవాత పార్వతి ఒకరోజు కూర్చుని తన మంచిమంచి చీరలన్నీ కత్తిరించి అతి శ్రద్ధగా రాబోయే శిశువుకి బొంతలు కుడుతూంది.

"ఇదేమిటి పార్వతీ, నీకొడుక్కి పక్కబట్టలే దొరకవూ యీఊళ్లో? చీరలన్నీ చింపేస్తున్నావేమిటి?" అన్నాడు భర్త.

"ఏమో! పిల్లవాడుపుట్టాక నేనెలా వుంటానో ఏమో! నేనే కనక శాశ్వతంగా కన్నుమూస్తే, యీ బీరువాలలో చీరలు చూసి మీరు బాధపడతారేమో! నా తరవాతవచ్చే ఆవిడ వాటిని ధరిస్తుందేమో!" నిస్పృహతో నవ్వింది.

"అదేమిటి పార్వతీ. అలా మాట్లాడతావెందుకూ?" ఎంతో బాధతో అన్నాడు... అంతేకాదు, ఇక మాట్లాడకుండా బయటికి వెళ్ళిపోయాడు.

కొన్నాళ్ళకి పార్వతి సుఖంగానే ప్రసవించింది. ఆ చిన్ని పసికందుని నర్సు ఎత్తిచూపితే, ఆమె హృదయం ఉప్పొంగింది. దగ్గరికి తీసుకుంది ఎంతో తృప్తిచెందిన మనస్సుతో.

* * *

ఒకసంవత్సరం గడిచింది. పార్వతికొడుక్కి. కాని పార్వతి ముఖంమీద ఎప్పుడూ చిందులాడే చిరునవ్వు మాయమైంది. తల్లిని ఆనమాలుకట్టి ఆపిల్లడి కళ్ళు మెరుస్తాయి-పార్వతికళ్ళు నీళ్ళతో నిండుతాయి. పార్వతికొడుకు లేచి నడవలేడు. పుట్టుకనుంచీ వెన్నులో ఏదో దోషం వుండడం మూలాన్ని లేచి తిరగలేడు. అతని తెలివి తేటలైన కళ్లుచూసి అనుకునేది పార్వతి...శక్తిహీనుణ్ణి చేసిన భగవంతుడు వాడికి బుద్ధికూడా లేకుండా చేస్తే బాగుండుననీ. నిజమే. అప్పుడు తన శక్తిహీనత గుర్తించుకోలేని స్తబ్దుగా పడివుంటాడు. "ఒక పిల్లవాడు యిలా అయితే అంతా అలాగే వుంటారా పార్వతీ. అలా బెంగపెట్టుకోకు" అంటూ భర్త ఓదార్చాడు. "ఒద్దు ఒద్దు, యీ ఒక్కడూచాలు. నాకూ ఆ వాత్సల్యం ఏమిటో తెలిసింది" అంటూ ఏడ్చింది పార్వతి. "నా స్వార్థంలో నేను ఏ దేవతలకో మ్రొక్కాను. నే కోరినదాన్నే వాళ్ళు చేశారు... నాకూ మాతృత్వం సిద్ధించింది. కాని, నేను లేకుంటే ఈ నిస్సహాయుడేమైపోతాడు?" అంటూ వాపోయింది పార్వతి.

...ఏ విధంగా తను భర్తదగ్గరగా వద్దామనుకుందో ఆ విధంగానే వచ్చింది. కాని అలా రాకుండా వుంటేనే బాగుండును అనుకుంటోంది యిప్పుడు పార్వతి. కాని లాభం? పెద్దకొడుక్కి అవిటివాడు ప్రథమ పుత్రుడని తల్లి హృదయం తరుక్కుపోయింది. అందరు పిల్లల తల్లులనీ వేళాకోళం చేసిన ఫలితం అనుభవిస్తూంది అనుకుంది ఆడపడుచు. "ఎవడో ఒకడు. అక్కా నీకూ ఆ వాత్సల్యం అర్థం అయింది, స్త్రీకి జీవితంలో కావలసింది అదే"అంటూ ఉత్తరం రాసింది చెల్లి. "ఏంచేస్తాం అలా బాధపడకు" అన్నాడు భర్త. అవును. ఏంచేస్తాం మన చేతుల్లో ఏదీలేనప్పుడు? ఏ కోర్కెలూ తీర్చని దేవతలు యిలాంటివే తీరుస్తారు కాబోలు! అనుకుంది. "అవును బాబూ! నువ్వే కావాలి నాకు. నా అవసరం నీకున్నంతకాలం నే వుంటాను." అని తన పాపని హృదయానికి హత్తుకుంటే...ఎక్కడలేని మనశ్శాంతీ వచ్చింది పార్వతికి...

